# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 07 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 5


## రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు వర్షాల హెచ్చరిక

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం మార్పు దిశగా సాగుతోంది. వచ్చే నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ కూడా జారీ చేసింది. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, ములుగు, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులు సంభవించవచ్చని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని హెచ్చరించింది.

బుధవారం నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. మిగితా 5వ పేజీలో

## బీసీ రిజర్వేషన్లపై పిటిషన్ కొట్టివేత

- విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు
- హైకోర్టులోనే తేల్చుకోవాలన్న సర్వోన్నత న్యాయస్థానం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 9ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ అంశంపై రాష్ట్ర హైకోర్టులో రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నందున విచారణకు నిరాకరించింది. విచారణ పరిధి హైకోర్టులో ఉన్నందున అక్కడే తేల్చుకోవాలని స్పష్టం చేసింది.

స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపుపై దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది. హైకోర్టులో ఇదే అంశంపై విచారణ జరుగుతున్నందున ఈ దశలో తమ ముందు కేసు స్వీకరించలేమని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ల పెంపును సవాల్ చేస్తూ వంగా గోపాల్‌రెడ్డి అనే వ్యక్తి సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు.

విచారణ సందర్భంగా ధర్మాసనం పిటిషనర్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించింది. "ఈ విషయమై హైకోర్టులో విచారణ జరుగుతుండగా ఇక్కడకు ఎందుకు వచ్చారు?" అని అడిగింది. దీనికి పిటిషనర్ లాయర్ "హైకోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించింది" అని సమాధానమిచ్చారు. దాంతో ధర్మాసనం "అక్కడ స్టే ఇవ్వలేదని ఇక్కడకు వస్తారా?" అంటూ వ్యాఖ్యానించింది. అసలు 32 ప్రకారం పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారు" అని ప్రశ్నించారు. మరోసారి పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... దసరా సెలవులకు ముందు, హైకోర్టు చివరి పని దినం రోజు ముగిశాక శుక్రవారం సాయంత్రం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 తీసుకువచ్చిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్ర హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశామన్నారు. అయితే ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు ధర్మాసనం.. జీవోపై స్టే ఇవ్వలేదని తెలిపారు. అందువల్లే రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం సుప్రీంకోర్టును ఆశ్రయించినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ జీవో 9 ప్రకారం... ఈ నెల 9 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుందని తెలిపారు. అందువల్ల స్టే ఇవ్వాలని పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యర్థించారు. అలాగే ఇదే అంశంపై దాఖలైన ఇతర పిటిషన్లపై ఈ నెల 8న హైకోర్టు విచారణ చేపట్టనున్నట్టు వివరించారు. ఈ వాదన లతో ఏకీభవించని ధర్మాసనం పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించింది. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు ఎలా వస్తారని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. ఈ అంశంపై హైకోర్టులోనే రెండు పిటిషన్‌లు పెండింగ్‌లో ఉన్నందున అక్కడే తగిన ఉత్తర్వులు పొందాలన్నారు. విచారణ పరిధి రాష్ట్ర హైకోర్టు పరిధిలోనిదని తేల్చి చెప్పారు. పిటిషన్‌ను ఉప సంహరించుకునేందుకు పిటిష నర్‌కు స్వేచ్ఛను ఇస్తూనే డిస్మిస్ చేస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

# ఎలి లిల్లీ భారీ పెట్టుబడి

- అమెరికా కంపెనీ 9 వేల కోట్ల రూపాయల పెట్టుబడి
- హైదరాబాద్ నుంచే ఔషధాల తయారీ.. సేవల విస్తరణ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కంపెనీ ప్రతినిధుల కీలక చర్చలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



ఫార్మా రంగంలో దిగ్గజ సంస్థ ఎలి లిల్లీ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కార్యకలాపాల విస్తరణ కోసం 9 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారితో సమావేశమైన ఎలీ లిల్లీ ప్రతినిధి బృందం ఆ మేరకు అంగీకారం తెలియజేసింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎలీ లిల్లీ అండ్ కో ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్ , సంస్థ ఇండియా ప్రెసిడెంట్ విన్స్‌లో టూకర్‌తో పాటు ఇతర ప్రతినిధులు ముఖ్యమంత్రి గారితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు ఉన్నారు.

ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలి లిల్లీ కంపెనీ కార్యకలాపాలను విస్తరించడానికి హైదరాబాద్ కేంద్రంగా కాంట్రాక్ట్ మ్యాన్యుఫాక్చరింగ్ నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అందుకోసం ఒక బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9000 కోట్లు) భారీ మొత్తాన్ని వెచ్చించనుంది. ముఖ్యమంత్రితో చర్చల అనంతరం ఎలీ లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ ఎత్తున కార్యకలాపాలకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో హైదరాబాద్ నుంచి కార్యకలాపాలను విస్తరిస్తున్నట్టు తెలియజేసింది.

కాంట్రాక్ట్ మ్యాన్యుఫాక్చరింగ్ ద్వారా సంస్థ కార్యకలాపాలను హైదరాబాద్ నుంచి విస్తరించాలన్న నిర్ణయంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సంస్థను అభినందించారు. తెలంగాణపై విశ్వాసం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను ధన్యవాదాలు తెలిపారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్ధతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మా హబ్‌గా ప్రఖ్యాతి గడించిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1965లో ఇందిరాగాంధీ ఐడీపీఎల్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడంతో ఫార్మా రంగం విస్తరించిందని గుర్తుచేశారు. పేరొందిన దిగ్గజ ఫార్మా కంపెనీలుండటంతో దేశంలో 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు.

కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. ఎలి లిల్లీ హైదరాబాద్ నుంచి వాణిజ్య కార్యకలాపాల్లో భాగంగా కాంట్రాక్ట్ మ్యాన్యుఫాక్చరింగ్ ద్వారా రాష్ట్రంతో పాటు దేశంలో ఫార్మా రంగంలో వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. వీలైనంత తొందరలోనే కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్‌మెంట్ నిపుణులు, ఇంజనీర్ల నియామకాలకు అవకాశం ఏర్పడుతుంది.

అమెరికాకు చెందిన ఎలి లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. ప్రధానంగా డయాబెటిస్, ఒబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎలి లిల్లీ కంపెనీ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్ట్ నెలలో గ్లోబల్ కెపాబులిటీ సెంటర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో ఎలి లిల్లీ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్‌తో తెలంగాణలో ప్రతిభావంతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపరుస్తుందని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు గారు వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్ గారు, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి గారు పాల్గొన్నారు.

## బీహార్ ఎన్నికల షెడ్యూల్ విడుదల




- నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్
- నవంబర్ 14న ఓట్ల లెక్కింపు.. ఫలితాల వెల్లడి
- షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్నికల సంఘం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. సోమవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సింధు, వివేక్ జోషిలతో కలిసి ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీలను ప్రకటించారు. నవంబర్ 6న తొలి విడత, నవంబర్ 11న రెండో విడత పోలింగ్ జరుగుతుందని ఆయన వెల్లడించారు. మొదటి దశలో 121 అసెంబ్లీ స్థానాలకు, రెండో దశలో 122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనున్నట్టు తెలిపారు. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేసి, ఫలితాలు వెల్లడిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు తరువాతే వివిప్యాట్, ఈవీఎంల లెక్కింపు చేపడతామని ఆయన చెప్పారు.

ఈసీఐనెట్ యాప్‌తో ఎప్పటికప్పుడు ఎన్నికల సరళి గురించి అప్‌డేట్ ఉంటుందన్నారు. ఓటింగ్ జరుగుతున్న సమయంలో ప్రతి రెండు గంటలకు ఒకసారి ఈ యాప్‌లో ఓటింగ్ డేటా అప్‌డేట్ అవుతుందని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. పోలింగ్ స్టేషన్ల వద్ద మొబైల్ డిపాజిట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్‌లను కొత్తగా ఇవ్వనున్నామనీ, ఆ స్లిప్స్‌పై ఓటరు ఐడీ నెంబర్ స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో అత్యధికంగా 1200 మంది ఓటర్లు మాత్రమే పోలింగ్ చేసే రీతిలో ఏర్పాట్లు చేశామన్నారు.

మొత్తం 7.43 కోట్ల మంది మిగితా 5వ పేజీలో



## రికార్డు స్థాయికి చేరిన బంగారం ధరలు

- ఒక్కరోజులో రూ. 9,700 పెరిగిన పసిడి
- కిలో వెండి రూ. 1.10 లక్షల దాటింది

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు, పండగ సీజన్ డిమాండ్ కలిసి పసిడికి మరింత వన్నె తెచ్చాయి. ఢిల్లీలో సోమవారం తులం (10 గ్రాములు) 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,30,000 మార్కును దాటింది. ఒక్కరోజులోనే రూ. 9,700 మేర పెరగడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇది ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధరగా నిలిచింది.

### వెండి ధరలు కూడా ఆకాశాన్నంటినవి

బంగారంతో పాటు వెండి ధరలు కూడా పెరుగుదల దిశగా సాగాయి. కిలో వెండి ధర రూ. 8,500 పెరిగి రూ. 1,10,000 వద్దకు చేరింది. పసిడి, వెండి ధరల పెరుగుదలతో జ్యువెలరీ వ్యాపారులు, వినియోగదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

నిపుణుల విశ్లేషణ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి ఈ పెరుగుదలకు మిగితా 5వ పేజీలో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ విడుదల





- 13న నోటిఫికేషన్
- 21 వరకు నామినేషన్ గడువు
- నవంబర్ 11న పోలింగ్, 14న ఓట్ల లెక్కింపు
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్నన్
- జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. రాజస్థాన్, పంజాబ్, జమ్మూకాశ్మీర్, మిజోరాం, జార్ఖండ్, ఒడిస్సా అసెంబ్లీతో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నికకు సంబంధించిన పోలింగ్ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇటీవల మరణించిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో ఖాళీ అయిన జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధానకార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైదరాబాద్ సీపీ సజ్జనార్‌తో కలిసి నోటిఫికేషన్‌కు సంబంధించిన వివరాలు, ఏర్పాట్లపై వివరించారు.

ఈ నెల 13న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ విడుదలకానుందన్నారు. కోట్ల విజయబాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో 21 తేదీవరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 22న నామినేషన్లను పరిశీలిస్తామన్నారు. మిగితా 5వ పేజీలో

## వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్ పురస్కారం




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వైద్యశాస్త్ర రంగంలో ఈ ఏడాది నోబెల్ పురస్కారం ముగ్గురు శాస్త్రవేత్తలకు దక్కింది. రోగనిరోధక వ్యవస్థ పై కీలకమైన అధ్యయనం చేసి, ఆటోఇమ్యూన్ వ్యాధులను నిరోధించే విధానాన్ని వెల్లడించినందుకు మేరీ బ్రుంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షిమోన్ సకగుచి లకు సంయుక్తంగా 2025 నోబెల్ అవార్డును ప్రకటించింది.

### రోగనిరోధక వ్యవస్థలో సెక్యూరిటీ గార్డుల్లా 'టీ కణాలు'

ఈ ముగ్గురు శాస్త్రవేత్తలు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థలో పనిచేసే రెగ్యులేటరీ టీ కణాలు అనే ప్రత్యేక కణాలపై లోతైన పరిశోధన చేశారు. వీటిని శరీరానికి సెక్యూరిటీ గార్డుల్లా వ్యవహరిస్తాయని గుర్తించారు. ఈ కణాలు మన శరీరంలోని ఆరోగ్యకరమైన కణాలపై రోగనిరోధక కణాలు దాడి చేయకుండా నిరోధిస్తాయని తెలిపారు. ఆటోఇమ్యూన్ వ్యాధులు రాకుండా నిలువరించే విధంగా టీ కణాలు పనిచేస్తాయని ముగ్గురు పరిశోధకులు నిర్ధారించారు. శరీరంలోని శక్తివంతమైన రోగనిరోధక వ్యవస్థను నియంత్రించకపోతే అది మన అవయవాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో పెరిఫరల్ ఇమ్యూన్ టాలరెన్స్ అనే వ్యవస్థను వివరించారు.

### వైద్య పరిశోధనలో నూతన దిశ

నోబెల్ కమిటీ ప్రకటనలో, "ఈ ముగ్గురు శాస్త్రవేత్తల పరిశోధనలు మానవ రోగనిరోధక వ్యవస్థ పనితీరును అర్థం చేసుకోవడంలో కొత్త దిశ చూపాయి. టీ కణాల అధ్యయనం వలన ఆటోఇమ్యూన్ వ్యాధులు ఎందుకు రావు, ఎలాంటి పరిస్థితుల్లో వస్తాయి అనే అంశం స్పష్టమవుతుంది," అని కమిటీ చైర్ ఓల్లీ కాంపె పేర్కొన్నారు.

### ముగ్గురి ప్రొఫెషనల్ వివరాలు

మేరీ బ్రుంకోవ్ : అమెరికాలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయాలజీలో పరిశోధకురాలు.

ఫ్రెడ్ రామ్స్‌డెల్ : సోనోమా బయోథెరప్యూటిక్స్, శాన్‌ఫ్రాన్సిస్కోలో పనిచేస్తున్నారు.

షిమోన్ సకగుచి : ఒసాకా యూనివర్సిటీ, జపాన్‌లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.

### ప్రపంచ వైద్య రంగానికి కొత్త మార్గదర్శకం

రోగనిరోధక వ్యవస్థను సమతుల్యం చేసే టీ కణాల ఆవిష్కరణతో భవిష్యత్తులో ఆటోఇమ్యూన్, అలర్జీలు, కేన్సర్, ఇమ్యూన్ డిజార్డర్స్ వంటి వ్యాధుల చికిత్సల్లో విప్లవాత్మక మార్పులు సాధ్యమవుతాయని నిపుణులు భావిస్తున్నారు.

## సీజేఐ బీఆర్ గవాయ్‌పై షూ విసరబోయిన లాయర్




- సుప్రీం కోర్టులో షాకింగ్ ఘటన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

దేశ సుప్రీంకోర్టులో మంగళవారం ఉదయం ఓ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఓ న్యాయవాది షూ విసరబోయిన ఘటన కలకలం రేపింది. అయితే అది బెంచ్ దాకా చేరకముందే కింద పడిపోయింది.

### "సనాతన ధర్మాన్ని అవమానిస్తే దేశం సహించదు" అంటూ నినాదం

విచారణ జరుగుతున్న సమయంలో లాయర్ కిషోర్ దాస్ కోర్టు గదిలో నుండి ఒక్కసారిగా లేచి "సనాతన ధర్మాన్ని అవమానిస్తే దేశం సహించబోదు" అని నినాదం చేస్తూ షూ విసిరే ప్రయత్నం చేశాడు. తోటి లాయర్లు వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని కోర్టు సిబ్బందికి అప్పగించారు. అనంతరం భద్రతా సిబ్బంది అతన్ని బయటకు తీసుకెళ్లారు.

### "ఇలాంటి చర్యలు నన్నేం చేయవు" : సీజేఐ గవాయ్ స్పందన

ఈ ఘటన తర్వాత కూడా సీజేఐ బీఆర్ గవాయ్ ప్రశాంతంగా వ్యవహరించారు. "ఇలాంటి చర్యలు నన్నేం చేయవు. మనం విచారణ కొనసాగిద్దాం" అని ఆయన లాయర్లకు సూచించారు. ప్రస్తుతం పోలీసులు దాడికి పాల్పడిన లాయర్ కిషోర్ దాస్‌ను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. దాడికి గల కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

### ఖజురహో కేసు వ్యాఖ్యలపై వివాదం నేపథ్యం

ఇటీవలి కాలంలో సీజేఐ గవాయ్ చేసిన వ్యాఖ్యలు ఒక వర్గం ఆగ్రహాన్ని రేపిన విషయం తెలిసిందే. మిగితా 5వ పేజీలో

## రాయదుర్గంలో ఎకరం రూ.177 కోట్లు

బలగం టీవీ, హైదరాబాద్


తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఐఐసీ) సోమవారం నిర్వహించిన వేలంలో హైదరాబాద్‌లో భూ మికి రికార్డు ధర పలికింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరం ధర రూ.177 కోట్లు చెల్లించారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని టీజీఐఐసీ వేలం వేసింది. దీంట్లో పాల్గొన్న ఎంఎస్‌ఎన్ రియాలిటీ సంస్థ అత్యధిక ధరతో 7.6 ఎకరాల భూమిని సొంతం చేసుకుంది. ఎకరాకు రూ.177 కోట్ల చొప్పున మొత్తం రూ.1357 కోట్లకు చేజిక్కించుకుంది. తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో కూడా రికార్డు ధర నమోదైంది. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో రికార్డు స్థాయిలో చదరపు గజం రూ.1.14 లక్షలు పలికింది.

ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, జీసీసీలు ఏర్పాటు చేసేందుకు ఉన్న సదుపాయాల వల్ల అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకొస్తున్నాయని, అందుకే రియాలిటీ రంగం ఊపందుకుందని టీజీఐఐసీ తెలిపింది. సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాలనలో తీసుకొచ్చిన పారదర్శకత, అభివృద్ధి వల్ల దేశంలోనే హైదరాబాద్ దూసుకెళ్తోందని పేర్కొంది. మరోవైపు, తెలంగాణ హౌజింగ్ బోర్డు ప్లాట్ల విక్రయాల్లో కూడా రికార్డు ధర నమోదైంది. కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లో చదరపు గజం రూ.1.14 లక్షలు పలికింది.

## ఆందోళన కలిగిస్తున్న రేబిస్ మరణాలు..

- హైదరాబాద్‌లో రేబిస్ వ్యాధితో బాలుడి మృతి..

బలగం టీవీ, హైదరాబాద్



రేబిస్ వ్యాధి మళ్లీ కలకలం సృష్టిస్తోంది. ఇటీవల రేబిస్ వ్యాధి కారణంగా నగరంలో ఓ బాలుడు మృతి చెందడం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. జనగామ జిల్లా, పాలకుర్తి మండలం, వావిలాల గ్రామం నుండి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి మాదాపూర్ ప్రాంతంలో స్థిరపడిన మైదం శ్రీనివాస్ అనే వ్యక్తి కుమారుడు శ్రీ చరణ్ (వయస్సు తెలియదు) రేబిస్ వ్యాధితో మరణించాడు.


సమాచారం ప్రకారం, బాలుడు శ్రీ చరణ్ సుమారు రెండు నెలల క్రితం వీధి కుక్క కాటుకు గురయ్యాడు. అయితే, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోవడం లేదా చికిత్సలో జాప్యం కారణంగా అతడు ఇటీవల అస్వస్థతకు గురయ్యాడు. రెండు రోజుల క్రితం ఆరోగ్యం మరింత క్షీణించడంతో బాలుడిని తార్నాకలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీ చరణ్ మరణించినట్లు ఆసుపత్రి వర్గాలు ధృవీకరించాయి.

సరైన సమయంలో రేబిస్ వ్యాక్సిన్ తీసుకోకపోవడం వల్లనే ఈ విషాదం జరిగిందని వైద్యులు చెబుతున్నారు. కుక్కలు, కోతులు వంటి జంతువులు కరిచిన వెంటనే అలసత్వం వహించకుండా తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలో లేదా తగిన వైద్య సదుపాయం ఉన్న చోట రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్య నిపుణులు ప్రజలను హెచ్చరిస్తున్నారు.

## ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం

- నూతన ప్రధాని సెబాస్టియన్ లెకోర్నూ రాజీనామా

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ అస్థిరత నెలకొంది. ఫ్రాన్స్ నూతన ప్రధానిగా నియమితుడైన మిగితా 5వ పేజీలో

# జైపూర్‌లో ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

- న్యూరో ఐసియూలో మంటలు
- ఆరుగురు రోగుల మృతి

బలగం టీవీ, జైపూర్

జైపూర్‌లోని ప్రభుత్వ సవాయ్ మాన్‌సింగ్ ఆసుపత్రి ట్రామా సెంటర్‌లో ఆదివారం అర్ధరాత్రి భయానక అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మంటలు చెలరేగిన ఘటనలో ఆరుగురు రోగులు ప్రాణాలు కోల్పోయారు. మంటలు చెలరేగిన సమయంలో 11 మంది రోగులు న్యూరో ఐసియూలో చికిత్స పొందుతున్నట్లు ట్రామా సెంటర్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ అనురాగ్ ధకాద్ తెలిపారు.



**షార్ట్ సర్క్యూట్ కారణమా?**

ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండొచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. మంటలు వేగంగా వ్యాపించడంతో సిబ్బంది రోగులను బయటకు తరలించే ప్రయత్నం చేసినప్పటికీ ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

**మరణించిన వారి వివరాలు**

మృతులను పింటు (సికార్), దిలీప్ (అంధి – జైపూర్), శ్రీనాథ్, రుక్మిణి, ఖుర్మా (భరత్‌పూర్), లిలిబహదూర్ (సంగనేర్ – జైపూర్)లిలిగా గుర్తించారు. "ఈ ఘటనలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు చనిపోయారు," అని డాక్టర్ ధకాద్ తెలిపారు.

ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి జోగారం పటేల్, హెూం శాఖ సహాయ మంత్రి జవహర్ సింగ్ బేధం సోమవారం ఉదయం ట్రామా సెంటర్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

అగ్నిప్రమాదానికి గల కారణాలను వెలికితీసేందుకు అధికారులతో దర్యాప్తు నివేదిక కోరినట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

ఈ ఘటనతో ఆసుపత్రుల్లో భద్రతా ప్రమాణాలపై మరోసారి చర్చ మొదలైంది. రోగుల భద్రత, విద్యుత్ సదుపాయాల సంరక్షణపై నిర్లక్ష్యం కారణమైందా అనే దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

# సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ వేగవంతం

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్



రెవెన్యూ శాఖ నుంచి వివిధ అవసరాల కొసం ప్రభుత్వ శాఖలకు కేటాయించిన భూముల వివరాలు, వినియోగం, ప్రస్తుతం వాటి పరిస్థితి తదితర అంశాలపై సమగ్ర నివేదికను రూపొందించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాజెక్ట్‌ల కోసం రెవెన్యూ విభాగం వేలాది ఎకరాల భూములను ఇరిగేషన్, ఫారెస్ట్ తదితర శాఖలకు కేటాయించిందని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్ట్‌ల్లో మార్పులు జరగడంతో పాటు కొన్ని రద్దయ్యాయని చెప్పారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని లెక్కలు తేల్చాలని అధికారులకు సూచించారు. గడచిన 30 సంవత్సరాల్లో అటవీ శాఖకు రెవెన్యూ శాఖ కేటాయించిన భూమి ఎంత? అదేవిధంగా అటవీ శాఖ రెవెన్యూ శాఖకు కేటాయించిన భూమి ఎంత? అనే వివరాలను రెండు శాఖలు సమన్వయంతో ఒక నివేదికను తయారుచేయాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1,138 ఎకరాల అటవీ భూమి కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే కేశవపురం త్రాగునీటి పథకం కోసం రెవెన్యూ శాఖ గతంలో అటవీశాఖకు 1,030 ఎకరాల భూమిని కేటాయించిందనీ, అయితే ఈ ప్రాజెక్ట్ రద్దయినందున సదరు భూమిని సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు బదలాయింపునకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి, అటవీ పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, పీసీసీఎఫ్, మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ పనులు పూర్తి చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి
- ఉప్పల్ రింగ్‌రోడ్‌లో నిరాహార దీక్ష

బలగం టీవీ, హైదరాబాద్




హైదరాబాద్ ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ప్రజలు ఎన్నాళ్లు ఈ అవస్థలు పడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజల గోస పట్టదా..? అని ప్రశ్నించారు. ఏడేండ్లు గడుస్తున్నా ఎలివేటర్ కారిడార్ పనులను పూర్తి చేయకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు. ఉప్పల్–నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులను సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 నెలల్లో పూర్తి చేయాల్సిన రోడ్డు ఏడేండ్లు గడిచినా 50 శాతం మాత్రమే పనులు అయ్యాయన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా పనులు ఎందుకు ముందుకు సాగడం లేదని ప్రశ్నించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్, వరంగల్ వైపు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు గుంత లమయంగా మారడంతో ప్రమాదాలు జరుగుతు న్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ విషయంపై సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నుంచి ముఖ్యమంత్రి, ఆర్అండ్‌బీ మంత్రికి లేఖ రాస్తామని చెప్పారు. ఈ పోరాటానికి పార్టీ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

సీపీఐ(ఎం) మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ.. ఉప్పల్–నారపల్లి పనులపై రకరకాల ప్రకటనలు వస్తున్నాయి తప్పితే పనులు మాత్రం ముందుకు సాగడం లేదన్నారు. దసరా వరకు పూర్తి చేస్తామన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇప్పుడు 2026 దసరా వరకు పూర్తి చేస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి వరకైనా పూర్తవుతుందా..? అని ప్రశ్నించారు. స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ స్పందించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. గతంలో ఎంపీగా పని చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఇక్కడి ఇబ్బందులు తెలుసని, చొరవ తీసుకోవాలని కోరారు. గతంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర, సంతకాల సేకరణ సైతం చేపట్టినట్టు తెలిపారు.

## ఎంబీబీఎస్ విద్యార్థి గణేశ్‌కు కేటీఆర్ అండ

బలగం టీవీ, హైదరాబాద్

జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని మెడికల్ సీటు సాధించిన వరంగల్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థి గణేశ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. గణేశ్ చదువులు కొనసాగించేందుకు అవసరమైన ట్యూషన్ ఫీజు, డిపాజిట్ కోసం తక్షణ ఆర్థిక సాయంగా రూ.1.5 లక్షలు అందజేశారు. వరంగల్‌కు చెందిన గణేశ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను, తోబుట్టువును కోల్పోయాడు. ఆయనను అమ్మమ్మ పెంచింది. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లోనే చదువుకున్న గణేశ్ కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. కానీ మెడికల్ కాలేజీలో చేరేందుకు అవసరమైన రూ.1.5 లక్షల ఫీజు, డిపాజిట్ చెల్లించలేని స్థితిలో ఉన్నాడు. ఈ నెల 6వ తేదీలోపు ఫీజు చెల్లించకపోతే సీటు కోల్పోయే ప్రమాదం ఉండడంతో గణేశ్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా సాయం కోరాడు. గణేశ్ విజ్ఞప్తిని గమనించిన కేటీఆర్ ట్విట్టర్ ద్వారా స్పందించి, తాను సాయం చేస్తానని ప్రకటించారు. మాట ఇచ్చినట్టుగానే మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ద్వారా విద్యార్థి వివరాలు సేకరించారు. అనంతరం గణేశ్‌కు రూ.1.5 లక్షల సాయం అందజేశారు.



## ప్రపంచ స్కిల్ కాంపిటీషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 15 రిజిస్ట్రేషన్‌కు తుదిగడువు
- ఉపాధి కల్పన, శిక్షణ శాఖ రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రశాంతి

బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఉపాధి కల్పన, శిక్షణ శాఖ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రశాంతి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 63 కేటగిరీల్లో పాల్గొనేందుకు దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 15 వరకు తుది గడువు ఉందని వివరించారు.


ఇది స్కిల్ ఒలింపిక్స్‌లాంటిదని అన్నారు. ఆరు నుంచి 24 ఏండ్ల వయస్సున్న వారు ప్రపంచ స్కిల్ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 5,500 మంది దరఖాస్తు చేశారని అన్నారు. నవంబర్‌లో రాష్ట్రంలో జోనల్ స్థాయి, డిసెంబర్‌లో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తామని వివరించారు. వచ్చే ఏడాది జనవరిలో దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ స్థాయి, ఫిబ్రవరిలో జాతీయ స్థాయి పోటీలుంటాయని చెప్పారు. సెప్టెంబర్‌లో చైనాలోని షాంఘైలో ప్రపంచస్థాయి పోటీలు జరుగుతాయని అన్నారు. ఇందులో 89 దేశాలు పాల్గొంటాయన్నారు. అర్హులైన వారు స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్ https://www.skillindiadigital.gov.in/home ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. యువత వారి నైపుణ్యాన్ని అంతర్జాతీయస్థాయిలో ప్రదర్శించడానికి అవకాశముందని వివరించారు. సైబర్ సెక్యూరిటీ, వెబ్ టెక్నాలజీ, ఉత్పత్తి రంగం, ఐటీ నెట్‌వర్క్ సిస్టమ్స్, పరిపాలన, ఎలక్ట్రానిక్స్, బ్రిక్ లేయింగ్, ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్, వంట చేయడం, బేకరీ, లాండ్‌స్కేప్ గార్డెనింగ్ వంటివాటితోపాటు ఇతర అంశాల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించొచ్చని చెప్పారు.

నిరక్షరాస్యులైనా నైపుణ్యం ఉంటే రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్కిల్ కాంపిటీషన్ యువతకు ఎంతో ఉపయోగమని అన్నారు. విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో చదివే విద్యార్థులు పాల్గొనాలని కోరారు. అందుకోసం వర్సిటీల వీసీలకు లేఖలు రాశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ఇటిక్యాల పురుషోత్తం, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ దేవరకొండకు తప్పిన పెను ప్రమాదం

- జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లి సమీపంలో కారును బొలెరో ఢీకొట్టింది

బలగం టీవీ, జోగులాంబ గద్వాల



సినీ హీరో విజయ్ దేవరకొండ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ఆదివారం సాయంత్రం పుట్టపర్తి సత్యసాయి సమాధిని దర్శించుకున్న విజయ్ దేవరకొండ సోమవారం హైదరాబాద్ చేరుకోవడానికి బయల్దేరిన సమయంలో కారు ప్రమాదానికి గురయ్యారు. ఆయన కారును ఉండవల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వినాయక వరసిద్ధి కాటన్ మిల్లు సమీపంలోని మలుపు వద్ద బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్ దేవరకొండ, మేనేజర్ రవికాంత్ యాదవ్, డ్రైవర్ అందె శ్రీకాంత్ ఎవరికి గాయాలు కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. అయితే విజయ్ దేవరకొండ కారు ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది. ప్రత్యక్ష సాక్షుల తెలిపిన వివరాల ప్రకారం, విజయ్ దేవరకొండ ప్రయాణిస్తున్న కారు వేగంగా ఉండటంతో బ్రేక్ వేయడానికి ముందే బొలెరో వాహనం ఢీకొన్నది. ఈ క్రమంలో పోలీసులు ఓవర్ స్పీడ్ ఫైన్ విధించినట్లు సమాచారం. డ్రైవర్ శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు ఉండవల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదం అనంతరం విజయ్ దేవరకొండ స్నేహితుని కారులో హైదరాబాద్ చేరుకున్నారు.

## ఎప్‌సెట్ బైపీసీ కౌన్సెలింగ్‌కు 11,224 మంది హాజరు

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా–డీ, బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ బైపీసీ విద్యార్థుల కౌన్సెలింగ్‌కు ఇప్పటి వరకు 11,224 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11,224 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని వివరించారు. వారిలో 11,001 మంది ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు ఈనెల ఎనిమిదో తేదీ వరకు గడువుందని పేర్కొన్నారు. ఈనెల 9 వరకు ధ్రువపత్రాల పరిశీలనకు అవకాశముందని తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల పదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముంటుందని వివరించారు. ఈనెల 13న ఎప్‌సెట్ బైపీసీ అభ్యర్థులకు తొలివిడత కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://tgeapcetb.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

# మహానటిలో ఏఎన్నార్ పాత్ర నా అదృష్టం



● నటుడు నాగచైతన్య

బలగం టీవీ, హైదరాబాద్

'మహానటి' సినిమాలో పాత్రను తప్పించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు నటుడు నాగచైతన్య తెలిపారు. జీ5లో ప్రసారమయ్యే 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. తన కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే, ప్రతి ఒక్కరి జీవితంలో ఒడుదొడుకులు ఉంటాయని, వాటి నుంచి పాఠం నేర్చుకొని పాజిటివ్‌గా ఆలోచిస్తూ ముందుకు వెళ్తే జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. మహానటి' సినిమా గురించి ఆయన గుర్తుచేసుకుంటూ.. 'నాగ్ అశ్విన్ నాకు 'మహానటి'లో తాతయ్య పాత్ర (ఏఎన్ఆర్) చేయాలని చెప్పగానే తప్పించుకోవడానికి చాలా ప్రయత్నం చేశా. ఎందుకంటే ఆయన లాగా నటించడం మరొకరికి సాధ్యం కాదు. 'నేను ఏఎన్నార్‌లా చేయడం ఏంటి?. నా వల్ల కాదు. అది అసాధ్యం. మర్చిపోండి' అని నాగ్ అశ్విన్‌తో చెప్పాను. పైగా ఆ సమయంలో 'సవ్యసాచి' షుటింగ్ చేస్తున్నా. గడ్డంతో డిఫరెంట్ లుక్‌లో ఉన్నా. ఆ సినిమాలో ఏఎన్నార్ పాత్రకు ఈ లుక్ సరిపోదని కారణం చెప్పి తప్పించుకోవాలనుకున్నా. గడ్డం తీయలేనని పంపించేశా. మళ్లీ నెలన్నర తర్వాత నాగ్ అశ్విన్ నా దగ్గరకు వచ్చాడు. 'వీఎఫ్ఎక్స్‌లో గడ్డం తీసేస్తాను. ఈ క్యారెక్టర్‌లో నువ్వు మాత్రమే

నటించాలి' అని పట్టుబట్టాడు. దీంతో ఓకే చెప్పానన్నారు. తర్వాత ఆలోచిస్తే ఒక విషయం అర్థమైంది. ఒకవేళ నేను చేయకపోతే వేరే నటుడు ఆ పాత్రలో చేస్తాడు. తాతయ్యగా వేరే వాళ్లు చేయడమంటే నా మనసు అంగీకరించదు. నాకు ఆఫర్ వచ్చాక.. నేనుండగా ఆ పాత్ర మరొకరు చేయడం ఏంటి? అనిపించింది. ఎవరేమనుకున్నా చేయాలి అని నిర్ణయించుకున్నా. ఆయనలాగా నేను నటించడం నాకు దక్కిన అదృష్టమని భావించాను. ఆయనపై నా ప్రేమను చూపించడానికి నాకు దక్కిన అవకాశమని అంగీకరించానని నాగచైతన్య చెప్పారు.

# నాగశౌర్య కొత్త సినిమా బ్యాడ్ బాయ్ కార్తీక్

● టీజర్ విడుదల చేసిన మేకర్స్

బలగం టీవీ, హైదరాబాద్

నాగశౌర్య ప్రధానపాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాడ్ బాయ్ కార్తీక్' రామ్ దేశినా (రమేశ్) దర్శకత్వం వహిస్తున్నారు. విధి కథానాయిక. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. యూత్‌ఫుల్, యాక్షన్ ఎంటర్‌టైనర్ కథతో దీనిని తెరకెక్కించినట్లు టీజర్ ఆధారంగా అర్థమవుతోంది. నటి పూర్ణ సీరియస్ లుక్‌లో కనిపించగా.. సాయి కుమార్ పోలీస్ పాత్రలో తనశైలిలో డైలాగ్ చెప్పారు. ఛలో సినిమాతో సూపర్ హిట్ అందుకుని బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ వచ్చిన నాగశౌర్య కొంత కాలంగా సైలెంట్ అయ్యాడు. చివరిగా 2023 లో రంగబలి అనే సినిమాతో ఆడియెన్స్ ముందుకు వచ్చాడు. ఆ సినిమా కూడా యావరేజ్ టాక్ తెచ్చుకుంది. దాంతో సినిమాలకు లాంగ్ గ్యాప్ ఇచ్చేసాడు. ఇక ఇప్పుడు లేటెస్ట్ గా నాగ శౌర్య 'బ్యాడ్ బాయ్ కార్తీక్' అనే యాక్షన్-ప్యాక్డ్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకులని అలరించటానికి వస్తున్నాడు. నూతన దర్శకుడు రామ్ దేశిన దర్శకత్వం వహించిన ఈ సినిమాను ఎప్పుడో ప్రకటించాడు శౌర్య. ఎప్పటినుండో సెట్స్ పై ఉన్న ఈ సినిమా టీజర్ ను ఈ రోజు రిలీజ్ చేసారు మేకర్స్. అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటెక్ష్మి-టంల్గక్ష్మినర్ గా బ్యాడ్ బాయ్ కార్తీక్ టీజర్ ను రిలీజ్ చేసారు.




భార్గీ క్ష్మిట్స్, రొటీన్ డైలాగ్స్ తో నింపేసారు. ఇక చివర్లో వెన్నెల కిషోర్ తో ఎదో కామెడీ అని ట్రై చేసారు. ఓవరాల్ గా చూస్తే బ్యాడ్ బాయ్ కార్తీక్ ఒక రొటీన్ కమర్షియల్ టీజర్ లానే అనిపిస్తోంది. ఈ సినిమాలో సీనియర్ నటుడు సముద్రఖని, సీనియర్ నరేష్, సాయికుమార్, మరియు శ్రీదేవి విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి రసూల్ ఎల్లోర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా తమిల్ స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ హారిస్ జయరాజ్ సంగీతం అందిస్తున్నారు. నాగ శౌర్య కు జోడిగా వీధి హీరోయిన్ గా నటిస్తుండగా వైష్ణవి ఫిలింస్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి ఈ చిత్రాన్ని నిర్మించారు.

# ద ప్యారడైజ్ ఇంటర్నేషనల్ మూవీ



● బాలీవుడ్ యాక్టర్ రాఘవ్ జుయల్ ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్

న్యాచురల్ స్టార్ నాని 'ది ప్యారడైజ్' సినిమాతో బిజీగా ఉన్నాడు. దసరా హిట్ తర్వాత మళ్లీ దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో జతకట్టిన నాని ఈసారి భారీ స్థాయి ప్రాజెక్ట్ చేయనున్నాడు. సుధాకర్ చెరుకూరి ప్రొడక్షన్‌లో నిర్మితమవుతున్న ఈ సినిమా 1980ల నాటి బ్యాక్‌డ్రాప్‌లో సాగనుందని సమాచారం. ఇందులో కాగా ఇప్పటికే విడుదలైన లుక్స్ లో.. నాని ఈ మూవీలో ఓ కొత్త తరహా మాస్ రోల్‌లో కన్పించనున్నాడు అని స్పష్టంగా అర్థమవుతుంది. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ యాక్టర్ రాఘవ్ జుయల్ విలన్‌గా నటిస్తున్నారు. అయితే తాజాగా ఈ ప్రాజెక్ట్ గురించి ఆయన చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ది ప్యారడైజ్ ఒక ఇంటర్నేషనల్ స్టాండర్డ్ మూవీ అవుతుంది. తెలుగు సినిమాను గ్లోబల్ లెవెల్‌కి తీసుకెళ్లే స్కోప్ ఈ ప్రాజెక్ట్‌కి ఉందని రాఘవ్ అన్నారు. అంతేకాదు, తన పాత్రకు న్యాయం చేయడానికి తెలుగు నేర్చుకుంటూ, సొంతంగా డబ్బింగ్ చెప్పేందుకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలిపారు. ఆయన డెడికేషన్ చూసి ఫ్యాన్స్ ఆశ్చర్యపోతున్నారు. మరోవైపు నాని-శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌కి దసరా తర్వాత మరోసారి బ్లాక్‌బస్టర్ హిట్టు ఖాయమని సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే 'ది ప్యారడైజ్‌లో హీరోయిన్‌గా ఎవరు నటించబోతున్నారు అన్నది ఇంకా క్లారిటీ రాలేదు.

## క్రికెటర్ సచిన్‌తో ప్రయాణం



● జీవితంలో మరవలేని అనుభూతి: తమన్

బలగం టీవీ, హైదరాబాద్

ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ మరోసారి వార్తల్లో నిలిచారు. సంగీతంతో ప్రేక్షకుల మనసు దోచుకుంటూనే, సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్స్‌తో పాటు వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ అభిమానులను ఎప్పటికప్పుడు అలరిస్తూ ఉంటారు. తాజాగా తమన్ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఓ పోస్ట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఇందులో ఆయన తనకు తారసపడిన అరుదైన క్షణాన్ని అభిమానులతో పంచుకున్నారు. డల్లాస్ నుండి దుబాయ్‌కు వెళ్తున్న సమయంలో తనతో కలిసి ప్రయాణించిన క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్ గురించి ట్వీట్ చేస్తూ, ఆయనతో దిగిన ఫోటోను పోస్ట్ చేశారు. క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ గారితో డల్లాస్ నుంచి దుబాయ్ వరకు ప్రయాణించడం గొప్ప అనుభవం. ప్రయాణ సమయంలో మేమిద్దరం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. సీసీఎల్ మ్యాచ్‌లలో నా బ్యాటింగ్ వీడియోలు చూపించాను. చూసిన వెంటనే సచిన్ 'నీ బ్యాట్ స్పీడ్ అద్భుతంగా ఉంది' అని ప్రశంసించారు. ఇది నా జీవితంలోని గొప్ప క్షణం. త్వరలోనే ఆయనతో కలిసి పని చేసే అవకాశం రావొచ్చు' అంటూ తమన్ పేర్కొన్నారు.తమన్ చివరిగా 'త్వరలో కలిసి పని చేయొచ్చు' అనే వ్యాఖ్య నెటిజన్లలో ఆసక్తిని రేపుతోంది. దీనిపై సోషల్ మీడియాలో వివిధ ఊహాగానాలు వెలువడుతున్నాయి. 'సచిన్ సినిమాల్లో నటించనున్నారా?, తమన్ సచిన్ బయోపిక్‌కి సంగీతం అందించనున్నారా?, లేదా ఇద్దరూ ఏదైనా క్రికెట్ ప్రాజెక్ట్ కోసం కలవబోతున్నారా? అని అభిమానులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. తమన్ కేవలం సంగీత దర్శకుడిగానే కాకుండా సెలబ్రిటీ క్రికెట్ లీగ్ లో తెలుగు వారియర్స్ తరపున క్రికెట్ ఆడుతూ తన బాటింగ్ టాలెంట్‌ను చూపించారు. చాలా మ్యాచుల్లో తన ఆటతో జట్టుకు విజయాన్ని అందించారు. ఇప్పుడు ఆయన బ్యాటింగ్ గురించి సచిన్ కూడా మాట్లాడటం తమన్‌కు మరింత గర్వకారణంగా మారింది. ఇటీవలే పవన్ కల్యాణ్ నటించిన 'ఓజీ' చిత్రానికి సంగీతం అందించి మ్యూజికల్ బ్లాక్‌బస్టర్‌గా మార్చిన తమన్, ప్రస్తుతం 'అఖండ 2: తాండవం', ప్రభాస్ 'ది రాజా సాబ్' వంటి భారీ ప్రాజెక్టులకి పనిచేస్తున్నారు.




# మిథాలీ రాజ్‌కు అరుదైన గౌరవం

● విశాఖ స్టేడియంలో ప్రత్యేక స్టాండ్

బలగం టీవీ, హైదరాబాద్

భారత మహిళల క్రికెట్‌కి చిరస్థాయి గుర్తింపు తెచ్చిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ కి అరుదైన గౌరవం దక్కింది. కెప్టెన్‌గా చెరగని ముద్ర వేసిన ఈ వెటరన్ ప్లేయర్ పేరుతో ఒక స్టాండ్‌ను ఏర్పాటు చేయాలని ఆంధ్ర క్రికెట్ సంఘం నిర్ణయించింది. ఈ మేరకు విశాఖపట్టణంలోని డా. వైఎస్. రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో "మిథాలీ రాజ్ స్టాండ్" ను ఏర్పాటు చేయనున్నారు. అక్టోబర్ 12న జరగబోయే భారత్-ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్ సందర్భంగా ఈ స్టాండ్‌ను ప్రారంభించనున్నారు. అలాగే మహిళా క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన మరో ఆంధ్ర క్రికెటర్ రవి కల్పన పేరుతో కూడా మరో స్టాండ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఏసీఏ ప్రకటించింది.

ఏసీఏ విడుదల చేసిన ప్రకటనలో "భారత క్రికెట్‌కు విశేష సేవలందించిన మిథాలీ రాజ్, రవి కల్పనలకు ఏసీఏ ప్రత్యేక గౌరవం కల్పిస్తోంది. తమ ఆటతో భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచిన ఈ ఇద్దరి పేర్లతో స్టాండ్లను ప్రారంభించాలనుకుంటున్నాం," అని పేర్కొంది. ఈ నిర్ణయం మహిళా క్రికెట్ అభివృద్ధికి దోహదపడుతుందని, యువతకు స్ఫూర్తి నింపుతుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# పాక్ బ్యాటర్‌కు డీమెరిట్ పాయింట్

బలగం టీవీ, హైదరాబాద్

మహిళల వన్డే వరల్డ్ కప్‌లో వరుసగా రెండు మ్యాచ్‌ల్లో పరాజయం పాలైన పాకిస్థాన్ జట్టుకు మరో షాక్ తగిలింది. భారత జట్టుతో జరిగిన మ్యాచ్‌లో పాక్ టాపార్డర్ బ్యాటర్ సిద్రా అమిన్ ఐసీసీ నియమావళిని ఉల్లంఘించడంతో, అంతర్జాతీయ క్రికెట్ మండలి ఆమెపై చర్యలు తీసుకుంది. మ్యాచ్ అనంతరం రిఫరీ షాండ్రే ఫ్రిట్జ్ ఐసీసీకి సిద్రా ప్రవర్తనపై ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఆమె లెవల్-1 తప్పిదానికి పాల్పడినట్లు తేలింది. దాంతో ఆమెకు ఒక డీమెరిట్ పాయింట్ విధించారు.

భారత్ నిర్దేశించిన 248 పరుగుల లక్ష్యాన్ని చేధించేందుకు పాక్ జట్టు కష్టపడుతుండగా ఇన్నింగ్స్ ఆరంభంలోనే పేసర్ క్రాంతి గౌడ్ 20 పరుగులకే రెండు వికెట్లు పడగొట్టి పాక్‌ను ఒత్తిడిలోకి నెట్టింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన సిద్రా అమిన్, నటాలియా పర్వేజ్‌తో కలిసి 68 పరుగుల భాగస్వామ్యం చేసింది. అమిన్ అర్ధశతకంతో ఆశలు రేపినా, 40వ ఓవర్లో స్నేహ్ రానా వేసిన బంతిని స్వీప్ షాట్ ఆడగా, భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుతంగా డైవ్ చేస్తూ క్యాచ్ అందుకుంది. వికెట్ కోల్పోయిన కోపంతో సిద్రా అమిన్ తన బ్యాట్‌ను పిచ్ మీద గట్టిగా కొట్టింది, అదే ఆమెకు ఇప్పుడు శిక్షకు కారణమైంది. మ్యాచ్ అనంతరం సిద్రా తన ప్రవర్తనపై క్షమాపణలు తెలిపినా, ఐసీసీ ఆమెకు ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. సాధారణంగా లెవల్-1 తప్పిదానికి మ్యాచ్ ఫీజులో 50 శాతం కోతతో పాటు రెండు డీమెరిట్ పాయింట్లు విధించే అవకాశం ఉన్నప్పటికీ, ఈసారి ఐసీసీ కొంత సడలింపు ఇచ్చింది.

## చాలాకాలం తరవాత మళ్లీ తెర మీదకు సమంత

● మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు



స్టార్ హీరోయిన్ సమంత చాలా రోజుల తర్వాత మళ్లీ సిల్వర్ స్క్రీన్‌కి రాబోతున్నారు. హెల్త్ ప్రాబ్లం కారణంగా సినిమాలకు కొంత బ్రేక్ ఇచ్చిన సమంత తర్వాత ప్రోడ్యూసర్ గా ఎంట్రీ ఇచ్చి తన ప్రొడక్షన్ హౌస్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరిట 'శుభం' మూవీతో నిర్మాతగా తన అడుగులు పెట్టి మొదటి చిత్రం తోనే హిట్ అందుకుంది. ఇప్పుడు మరో ప్రాజెక్ట్ 'మా ఇంటి బంగారం'తో ఫ్యాన్స్ ముందుకు రాబోతుంది. గతేడాది ఈ మూవీ నుండి విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియోలో సమంత గన్, మెడలో తాళి బొట్టు, రక్తంతో నిండిన ముఖంతో ఫుల్ డ్రామా లుక్‌లో కనిపించారు. ఈ లుక్ చూసిన ఫ్యాన్స్ ఈ సినిమా షుటింగ్ ఎప్పుడు మొదలవుతుందని ఎదురు చూసే పరిస్థితి నెలకొంది. ఆ అప్‌డేట్ కోసం సోషల్ మీడియా ఫ్యాన్స్ చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇప్పుడు ఈ నెలలోనే 'మా ఇంటి బంగారం' షుటింగ్ ప్రారంభం అవుతుంది అంటూ సమంత స్వయంగా తెలిపారు. దీంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్. చాలా రోజుల తర్వాత సమంతను మళ్లీ స్క్రీన్‌లో చూడబోతున్నాం అంటూ మురిసి పోతున్నారు. సోషల్ మీడియాలో ఇప్పటికే ఈ వార్త ట్రెండ్ అవుతోంది.

# ఆర్ఆర్ఆర్ భూ బాధితుల ఆందోళన

**బలగం టీవీ, హైదరాబాద్**

రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్చడాన్ని నిరసిస్తూ అన్నదాతలు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూ పికెట్లు ఎత్తి నినాదాలు చేశారు. సీపీఎం పిలుపు మేరకు నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల బాధిత రైతులు హైదరాబాద్ అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయానికి తరలివచ్చారు.

ఆర్ఆర్ఆర్ కోసం బలవంతంగా భూములను లాక్కుంటే ఊరుకోబో మని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గ్రామ సభలను నిర్వహించి రైతుల ఆమోదంతోనే భూములను సేకరించాలని డిమాండ్ చేశారు. రైతుల అనుమతి లేకుండా భూమిని తీసుకుంటే ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడిస్తామని అన్నారు. ఇదే వైఖరి కొనసాగిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతులంతా ఏకమై తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. 2013 చట్టంలోని షెడ్యూల్-1లో చూపిన విధంగా మార్కెట్ రేటుకు నాలుగు రెట్లు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, ఫార్మా సంస్థల యాజమానులు, ధనికులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే అలైన్‌మెంట్‌లో ప్రభుత్వం మార్పులు చేస్తున్నదని విమర్శించారు. పేదల భూముల నుంచే వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితుల సమస్యలపై సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నిర్వాసితులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అలైన్‌మెంట్ మార్పు, భూసేకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ రాజకీయ నాయకులు, వ్యాపారులు, ధనికులు భూమి కోల్పోకుండా చిన్న రైతులు, పేదల భూములను మాత్రమే తీసుకునేలా అలైన్‌మెంట్‌ను మారుస్తున్నారని విమర్శించారు. పోలీసులను ఉపయోగించి రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి భూములకు సంబంధించిన సర్వే నెంబర్లు ప్రకటించి హద్దులు పెడుతున్నారని అన్నారు. భూమి ఇవ్వడానికి సిద్ధంగా లేరని చెప్పారు. తరతరాలుగా ఆ భూమిపై ఆధారపడి బతుకుతున్నారని వివరించారు. అయినా బలవంతంగా ఆ భూమిని తీసుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. రైతులకు తెలియకుండానే భూమిని తీసుకుంటున్నదని చెప్పారు. భూమికి భూమి ఇవ్వాలనే నిబంధనను పట్టించుకోవడం లేదన్నారు. 2013 చట్టం ప్రకారం మార్కెట్ ధరకు నాలుగు రెట్లు పరిహారం ఇవ్వాల్సి ఉన్నా అమలు చేయడం లేదని చెప్పారు. ఎకరా రూ.10 కోట్లు, రూ.ఐదు కోట్లు ఉంటే ప్రభుత్వం రూ.పది లక్షలు, రూ.15 లక్షలు, రూ.20 లక్షలు పరిహారం ఇస్తున్నదని వివరించారు. రైతుల ఆమోదం లేకుండా సెంటు భూమి తీసుకున్నా సహించేది లేదన్నారు. గ్రామసభలు జరిపి రైతుల ఆమోదం ఉంటేనే తీసుకోవాలని కోరారు. ఆర్ఆర్ఆర్ తర్వాత రింగ్ రైలు వస్తుందంటున్నారనీ, దానికోసం భూసేకరణ అవసరమవుతుందని వివరించారు. ఆ భూములన్నీ వ్యవసాయ యోగ్యమైనవనీ, పంటలు పండుతాయని అన్నారు. రైతులకు అన్యాయం చేస్తే తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. రైతులతో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. చర్చలు జరపం, నిర్బంధం ప్రయోగిస్తామంటే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతి ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికీ పడుతుందని చెప్పారు. రైతులకు, నిర్వాసితులకు, ఆ భూములకు సీపీఐ(ఎం) అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే గ్రామాల్లో సభలు నిర్వహించి రైతులను సంఘటితం చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

నామినేషన్లు ఉపసంహరణకు ఈ నెల 24 చివరి తేదని తెలిపారు. నవంబర్ 11న పోలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. నవంబర్ 14న లెక్కింపు ఉంటుందన్నారు. 16తో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ పరిధిలో మొత్తం 3,92,669 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. 139 లోకేషన్స్‌లో, 407 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, 38మంది సెక్టార్ అధికారులతోపాటు 2400 పోలీస్ ఇతర శాఖలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉప ఎన్నికలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల, వీవీ ప్యాట్ యంత్రాలను వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ యంత్రాలను ఇప్పటికే పరిశీలించామన్నారు. ఓటర్లు తమ ఓటరు గుర్తింపు కార్డు (ఇపీఐసీ)తో పాటు ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, ప్యాన్ కార్డు, పెన్షన్ పత్రం వంటి గుర్తింపు పత్రాలతో ఓటు వేయవచ్చని తెలిపారు. హైదరాబాద్ జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు తమకు ఉన్న క్రిమినల్ నేపథ్య వివరాలను పత్రికలు, టీవీ, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రకటించడం తప్పనిసరని స్పష్టం చేశారు. ఓటర్లు వారి పేర్లు ఓటరు జాబితాలో ధ్రువీకరించుకుని, ఎన్నికల్లో సక్రమంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫేక్ న్యూస్‌లను వైరల్ చేయవద్దని, ఏదైనా ఉంటే నిర్ధారించుకుని వార్తలను ప్రసారం చేయాలన్నారు.

వెపన్స్ డిపాజిట్ చేయాలి : హైదరాబాద్ సీపీ

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పలు ప్రాంతాలల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తామన్నారు. అభ్యర్థులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తే కేసులు తప్పవన్నారు. ఎన్‌బీడబ్ల్యూ కేసులపై స్పెషల్ టీమ్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. పాతనేరస్తులు, రౌడీషీటర్లపై దృష్టిసారిస్తామని, వెపెన్స్ ఉంటే డిపాజిట్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ సీపీ ఎక్బాల్, అదనపు డీసీపీ నర్సింహారెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

**21 వరకు నామినేషన్ల స్వీకరణ**

నోటిఫికేషన్ విడుదల: అక్టోబర్ 13
నామినేషన్లకు తుది గడువు: అక్టోబర్ 21
నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 22
నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు: అక్టోబర్ 24
పోలింగ్ తేదీ: నవంబర్ 11
ఓట్ల లెక్కింపు : నవంబర్ 14

# సీజేఐ బీఆర్ గవాయ్‌పై షూ విసరబోయిన లాయర్

(మొదటి పేజీ తరువాయి)

మధ్యప్రదేశ్‌లోని ఖజురహెూ జవారీ ఆలయంలో ధ్వంసమైన విష్ణుమూర్తి విగ్రహ పునరుద్ధరణపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కొట్టివేస్తూ ఆయన "ఇది పబ్లిసిటీ పిటిషన్ మాత్రమే" అని వ్యాఖ్యానించారు. తీర్పు సమయంలో గవాయ్ మాట్లాడుతూ, "ఆలయం పురాతత్వ శాఖ పరిధిలో ఉంది. ఏఎస్ఐతో మాట్లాడండి. లేదంటే మీరు విష్ణుభక్తులైతే ఆయననే వేడుకోండి" అని వ్యాఖ్యానించారు. ఆయన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీశాయి. కొందరు ఆయన వ్యాఖ్యలను "హిందూ భావాలను దెబ్బతీసేలా" ఉన్నాయని విమర్శించారు.

**"అన్ని మతాలను గౌరవిస్తాను" – గవాయ్ వివరణ**

సోషల్ మీడియాలో విమర్శలు ఊపందుకున్న నేపథ్యంలో సెప్టెంబర్ 18న గవాయ్ తన వ్యాఖ్యలపై స్పష్టత ఇచ్చారు. "నేను అన్ని మతాలను గౌరవిస్తాను. నా మాటలు తప్పుగా ప్రచారం అయ్యాయి" అని ఆయన అన్నారు. అదే సమయంలో సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ కూడా గవాయ్‌కు మద్దతుగా మాట్లాడారు. "సోషల్ మీడియా అనేది కళ్లెం లేని గుర్రం లాంటిది. దానిని అదుపు చేయడం చాలా కష్టం" అని ఇద్దరూ వ్యాఖ్యానించారు.

ఛత్తర్‌పూర్ జిల్లాలోని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద ఖజురహెూ ఆలయ సముదాయంలోని జవారీ ఆలయంలో ఏడడుగుల విష్ణుమూర్తి విగ్రహం ధ్వంసమైంది. దీని పునరుద్ధరణకు ఆదేశాలివ్వాలని రాకేశ్ దలాల్ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రనన్ ధర్మాసనం ఆ పిల్‌ను తిరస్కరించింది.

# రాష్ట్రంలో మరో నాలుగు రోజులపాటు వర్షాల హెూరు

(మొదటి పేజీ తరువాయి)

**బుధ, గురువారాల్లో వర్షాల తీవ్రత పెరగనుంది**

బుధవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

గురువారం నాడు ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్%–%మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా.

శుక్రవారం నాడు ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్%–%మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, మెరుపులు సంభవించే ప్రాంతాల్లో ఓపెన్ గ్రౌండ్‌లలో నిలబడరాదని వాతావరణశాఖ సూచించింది. రైతులు తమ పంటలను రక్షించుకునే చర్యలు తీసుకోవాలని సూచించింది.

# బీహార్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

బీహారీ ఓటర్లలో 3.92 కోట్ల మంది పురుషులు, 3.51 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారని జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకుంటున్న ఓటర్లు 14 లక్షల మంది ఉన్నట్టు ఆయన వెల్లడించారు. ఎలాంటి ఫిర్యాదులకైనా 1950 నెంబర్‌కు ఓటర్లు డయల్ చేయొచ్చని తెలిపారు.

ఏ పోలింగ్ కేంద్రంలోనూ 1200 మందికి మించి ఓటర్లు ఉండరనీ, తాజా సవరణతో బీహార్‌లో ప్రస్తుతమున్న 77,895 పోలింగ్ కేంద్రాలు 90,712కి పెరిగాయన్నారు.

మొత్తం 243 స్థానాలు కలిగిన బీహార్ అసెంబ్లీకి నవంబర్ 22తో గడువు ముగియనుంది. ఈలోగా కొత్త ప్రభుత్వం కొలువుదీరాల్సి ఉంటుంది. కాగా 2020లో జరిగిన ఎన్నికల్లో మూడు విడతల్లో పోలింగ్ జరుగగా.. అంతకు ముందు ఐదు విడతల్లో పోలింగ్ నిర్వహించారు. కానీ ఈసారి మాత్రం రెండు విడతల్లోనే పోలింగ్ నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేశారు.

**నవంబర్ 11న దేశవ్యాప్తంగా 8 స్థానాలకు బైపోల్స్**

దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 8 అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరుగనున్నాయి. నవంబర్ 11న బీహార్ అసెంబ్లీ పోలింగ్ రెండో దశతో పాటు ఈ ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్టు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. నవంబర్ 14న బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో పాటు ఉప ఎన్నికల ఫలితాలు కూడా ప్రకటిస్తామని వెల్లడించారు. ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలైన తెలంగాణ, రాజస్తాన్, జార్ఖండ్, పంజాబ్, మిజోరం, ఒడిశా, జమ్మూకాశ్మీర్‌లో ఖాళీ అయిన ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 11న ఉపఎన్నికలు జరుగనున్నాయి.

తెలంగాణలోని జూబ్లీ హిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, పంజాబ్‌లోని తర్న్ తరణ్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహల్, జార్ఖండ్‌లోని ఘట్సిలా నియోజకవర్గం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్, మిజోరాంలోని డంపా నియోజకవర్గం ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా, ఒడిశాలోని నువాపాడ ఎమ్మెల్యే రాజేంద్ర ధోలాకియా మరణించిన నేపథ్యంలో ఆయా స్థానాలు ఖాళీ అయ్యాయి. రాజస్తాన్‌లోని అంటా ఎమ్మెల్యే కన్వర్‌లాల్ మీనా దోషిగా తేలి అనర్హత వేటు పడటంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. జమ్మూకాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా రెండో స్థానంలో పోటీ చేసి గెలిచిన తరువాత రాజీనామా చేసిన బుద్గామ్, ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఖాళీ అయిన నగ్రోటా స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. దీంతో ఈ ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఎన్నికల సంఘం ఉప ఎన్నికలను నిర్వహిస్తున్నది.

# రికార్డు స్థాయికి చేరిన బంగారం ధరలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కారణమని చెబుతున్నారు. పెట్టుబడిదారులు బంగారాన్ని సురక్షితమైన ఆస్తిగా భావిస్తూ దానిపై పెట్టుబడులు పెంచుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 2,600 డాలర్ల స్థాయిని దాటడంతో దేశీయ ధరలు పెరిగాయని తెలిపారు. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం కూడా బంగారం దిగుమతుల ఖర్చు పెంచిందని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితి దేశీయ మార్కెట్‌లో పసిడి ధరలను మరింత పెంచే దిశగా నడిపింది. దసరా, దీపావళి వంటి పండగల సీజన్‌లో బంగారం కొనుగోళ్లు పెరుగుతున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్ అస్థిరత కారణంగా చాలా మంది మదుపరులు తమ పెట్టుబడులను బంగారం వైపు మళ్లిస్తున్నారు. దీంతో డిమాండ్ మరింతగా పెరిగి ధరలు ఎగబాకుతున్నాయి. ఈ ఆకస్మిక పెరుగుదల సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రమైన ఆర్థిక భారాన్ని మోపుతోంది. పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది షాక్‌గా మారింది.

మార్కెట్ నిపుణులు ధరలు స్వల్పకాలికంగా ఒడిదొడుకులు ఎదుర్కొనే అవకాశం ఉన్నప్పటికీ, దీర్ఘకాలికంగా పసిడి ధరలు బలంగా నిలవొచ్చని అంచనా వేస్తున్నారు. కొనుగోలుదారులు గోల్డ్ ఈటీఎఫ్‌లు, సావరిన్ గోల్డ్ బాండ్స్ వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలను కూడా పరిశీలించాలని సూచిస్తున్నారు.

# ఫ్రాన్స్‌లో మళ్లీ రాజకీయ సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

సెబాస్టియన్ లెకోర్నూ తన పదవికి రాజీనామా చేశారు. పదవి చేపట్టిన నెల రోజులు కూడా పూర్తి కాకముందే ఆయన దిగిపోవడం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. గత నెల జాతీయ అసెంబ్లీలో జరిగిన విశ్వాస పరీక్షలో ప్రధాని ఫ్రాంకోయిస్ బేరౌ ఓడిపోవడంతో, అధ్యక్షుడు ఎమ్మాన్యువెల్ మాక్రన్ సెబాస్టియన్‌ను కొత్త ప్రధానిగా నియమించారు. అప్పటినుంచి ఆయన వివిధ రాజకీయ పార్టీలతో విస్తృతంగా సంప్రదింపులు జరిపారు.ఆదివారం తన కొత్త మంత్రివర్గాన్ని ప్రకటించిన కొద్దిసేపటికే ఆయన రాజీనామా చేయడం రాజకీయ వర్గాలను షాక్‌కు గురిచేసింది. నేడు జరగాల్సిన మంత్రివర్గ తొలి సమావేశానికి ముందు ఆయన తన రాజీనామా పత్రాన్ని సమర్పించారని, అధ్యక్షుడు మాక్రన్ దాన్ని ఆమోదించినట్లు సమాచారం.